క్లుప్తంగా

ఘనంగా చంద్రప్రభ ఉత్సవం



నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలో భగవద్రామానుజాచార్యుల వారి 1008వ అవతార మహోత్సవాలు విశేషంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి భగవద్రామానుజాచార్యుల వారికి చంద్రప్రభ పేట ఉత్సవం వేడుకగా జరిగింది. ఉదయం శాస్త్రోక్తంగా తిరుమంజనం, సాయంత్రం మంగళాశాసనోత్సవం నిర్వహించారు. ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

బాలలకు అవగాహన

నెల్లూరు(బృందావనం): కొండాయపాళెం రోడ్డు వనంతోపు సెంటర్ దగ్గర ఉన్న జనహిత, వాత్సల్య నిరాదరణ బాలల కేంద్రం, బుజబుజ నెల్లూరులోని సింహపురి చిల్డ్రన్స్ హోంలో బాలలకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ ఆదేశాల మేరకు వచ్చినట్లు ఆమె తెలిపారు. బాలలకు కల్పించిన వసతుల గురించి ఆరాతీశారు. ఏ సమస్య వచ్చినా సంస్థను సంప్రదించాలని వాణి తెలిపారు. బిస్కెట్లు పంపిణీ చేశారు.

2న భక్తిరంజని

నెల్లూరు(బృందావనం): శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వచ్చే నెల 2వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఘంటసాల కళానికేతన్ ఆధ్వర్యంలో భక్తిరంజని పాటకచ్చేరి నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు, గాయకుడు కోడూరు ఆనందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమర గాయకుడు ఘంటసాల గానం చేసిన భక్తిగీతాలను ఆలపించడం జరుగుతుందన్నారు. అలాగే గురుకృపా కళాక్షేత్రం సురభి గాయత్రి శిష్య బృందంచే నృత్యరూపకం ప్రదర్శించనున్నట్లు వివరించారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల సౌజన్యంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ఘనంగా రవివర్మ జయంతి



నెల్లూరు(బృందావనం): ప్రముఖ చిత్రకారుడు రాజా రవివర్మ జయంతిని మంగళవారం టెక్కెమిట్టలోని అమీర్ ఆర్ట్స్ అకాడమీలో ఘనంగా నిర్వహించారు. నిర్వాహకుడు అమీర్‌జాన్ ఆధ్వర్యంలో రవివర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో చిత్రకారుడు బాలకృష్ణ, బాలలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు

వెంకటాచలం: మండలంలోని కందలపాడు తిప్పపై గ్రావెల్ తవ్వకాలను గ్రామస్తులు మంగళవారం అడ్డుకున్నారు. తిప్పపై గ్రావెల్ తవ్వకాలు చేపట్టేందుకు అనుమతులు పొందిన నిర్వాహకులు కొన్నిరోజుల నుంచి తవ్వే ప్రయత్నాలు చేస్తుండగా గ్రామస్తులు అడ్డుకుంటున్నారు. తమకు అన్ని అనుమతులు ఉన్నాయని, పర్యావరణ అనుమతులు కూడా వచ్చాయని నిర్వాహకులు మంగళవారం గ్రామానికి వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. అన్ని కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తున్న తిప్పను తవ్వేందుకు తాము ఒప్పుకోమని తెగేసి చెప్పడంతో వెనక్కి వచ్చేశారు.

జాగ్రత్తమ్మా..




నెల్లూరులోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం సమీపంలో నివసించే చిన్నారులు గుడ్డ ముక్కలతో చెట్టు కొమ్మకు ఊయల కట్టుకుని ప్రమాదకర స్థితిలో ఊగుతుండగా తీసిన చిత్రం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

ఆరోగ్యమే మహాభాగ్యం

- ఫిట్‌నెస్‌పై యువత దృష్టి
- రోజూ గంటకు పైగా జిమ్‌లో గడుపుతూ..
- శరీరాకృతి, హెల్త్‌పై ఫోకస్
- ప్రత్యేక ప్యాకేజీలను ప్రవేశపెడుతున్న నిర్వాహకులు





జిమ్‌లో కసరత్తులు చేస్తూ..

నెల్లూరు సిటీ: నేడు అనేకమంది ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ హెల్త్‌ను కాపాడుకునేందుకు జాగింగ్, వాకింగ్, యోగా చేస్తున్నారు. ప్రధానంగా యువత ఫిట్‌నెస్‌పై శ్రద్ధ పెట్టి జిమ్ సెంటర్లకు క్యూ కడుతున్నారు. శరీరాకృతిని వృద్ధి చేసుకునేందుకు, అధిక బరువును తగ్గించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. రోజులో గంటకు పైగా సమయాన్ని జిమ్‌కు కేటాయిస్తున్నారు.

150కి పైగా..

నగరంలో మొత్తం 50కి పైగా జిమ్ సెంటర్లున్నాయి. ఇక జిల్లాలో చూస్తే ఆ సంఖ్య 150కు పైగానే ఉంటుంది. గతంలో కేవలం నగరానికి మాత్రమే పరిమితమైన జిమ్ సెంటర్లు, ఇప్పుడు చిన్న పట్టణాలకు విస్తరించాయి. తెల్లవారుజామునే వాటిని తెరుస్తున్నారు. ఉదయం 10.30 గంటల వరకు నిర్వహిస్తున్నారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. ఉదయం సమయంలో బిజీగా ఉండే వారు సాయంత్రం వేళలో జిమ్ చేసేందుకు సమయం కేటాయిస్తున్నారు.

ప్రత్యేక ప్యాకేజీలు

నగరంలో పెద్ద ఎత్తున నాన్ ఏసీ, ఏసీ జిమ్‌లున్నాయి. ఒక్కో దాంట్లో ఒక్కో ప్యాకేజీ ఉంటుంది. నెలకు రూ.500 నుంచి రూ.1,500 వరకు, మూడు నెలలకు రూ.1,000 నుంచి రూ.3,000 వరకు, ఏడాదికి రూ.3,000 నుంచి రూ.10,000 వరకు, ఇంకా కపుల్ ఆఫర్స్ కింద ఇద్దరికి రూ.7,000 నుంచి రూ.15,000 వరకు, ప్రత్యేక జిమ్ కోచ్ కోసం నెలకు రూ.5,000 నుంచి రూ.8,000 వరకు తీసుకుంటున్నారు.

ఆహారంలో మార్పులు తప్పనిసరి

రోజూ గంటకు పైనే జిమ్ చేస్తున్నా.. అయినా తగ్గడం లేదని కొందరు అంటుంటారు. అయితే ఆహారం విషయంలో మార్పు లేకుంటే ఆకర్షణీయమైన శరీర సౌష్టవం రావడం కష్టమే. ప్రస్తుత రోజుల్లో జంక్‌ఫుడ్‌ను తినేందుకు ఆసక్తి చూపేవారి సంఖ్య ఎక్కువే. అలాగే శరీర బరువు తగ్గాలన్నా.. ఫిట్‌గా ఉంచాలన్నా.. ఇష్టానుసారంగా జిమ్ చేస్తే కండరాలు దెబ్బతినే అవకాశం ఉంది. ప్రత్యేక ఆహారాన్ని తీసుకోవాలని ట్రెయినర్లు చెబుతున్నారు. నిపుణుల సలహాల మేరకు ఆహారం తీసుకుంటూ జిమ్ చేస్తే ఉపయోగం ఉంటుంది. ప్రతిచోట ట్రెయినర్లు ఉంటున్నారు. కొత్తగా చేరిన వారు ఎలా వర్కౌట్స్ చేయాలో వారు సూచనలు ఇస్తుంటారు. ఇక శరీర బరువు తగ్గించుకోవడానికి, ఫిట్‌నెస్ కోసం జిమ్‌లకు మహిళలు కూడా ఎక్కువగా వస్తున్నారు. నిర్వాహకులు వారికి ప్రత్యేకంగా ట్రెయినర్లను ఏర్పాటు చేస్తున్నారు.

వ్యాయామంపై ఆసక్తి



నేను 30 ఏళ్లుగా జిమ్ సెంటర్‌లు నిర్వహిస్తున్నా. అన్ని వర్గాలకు అనుకూలంగా ఏసీలు, నాన్ ఏసీ సెంటర్‌లు పెట్టాను. మహిళలకు ప్రత్యేకంగా ట్రెయినర్లను ఏర్పాటు చేస్తున్నాం. రోజురోజుకు యువత, మహిళలు జిమ్ సెంటర్లకు వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు.

– లోడి ఖాన్, స్లిమ్ లైఫ్ జిమ్ సంస్థల నిర్వాహకుడు

సమయం కేటాయించాలి



రోజులో ఒక గంట వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ప్రస్తుతం జిమ్‌కు అన్ని వయసుల వారు వస్తున్నారు. ఎక్కువగా యువత మక్కువ చూపుతోంది. ఫిట్‌గా ఉండేందుకు ఏం చేయాలో తెలుసుకుంటున్నారు. కొందరు సిక్స్‌ప్యాక్ కావాలంటారు. ఇష్టానుసారంగా కాకుండా సరైన పద్ధతిలో ముందుకెళ్లాలి.

– రంజిత్‌కుమార్, జిమ్ ట్రెయినర్

ఆరోగ్యంపై దృష్టి



నేడు చాలా మంది సినిమాలు, షికార్లు పక్కన పెట్టి ఆరోగ్యంపై దృష్టి పెట్టారు. తీసుకునే ఆహారం, వ్యాయమం బట్టి ఆరోగ్యాన్ని కాపాడుకోగలం. జిమ్‌ల్లో స్త్రీలకు కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

– నవనీత, వేదాయపాళెం

ఫిట్‌గా ఉండేందుకు..



ఎన్ని పనులున్నా రోజులో ఒక గంట కచ్చితంగా వ్యాయామానికి సమయం కేటాయిస్తాను. ఆరోగ్యంతోపాటు ఫిట్‌నెస్ లభిస్తుంది. ప్రస్తుత రోజుల్లో తప్పనిసరిగా వ్యాయామం అవసరం. జిమ్ ట్రెయినర్ల సూచనలు మేరకు వ్యాయామం చేస్తుంటాను.

– రమేష్, చిన్నబజారు

ఐటీఐలో చేరికకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(టౌన్): వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలికల ఐటీఐలో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఏడుకొండలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 24వ తేదీలోపు ఆన్‌లైన్‌లో బాలురు, బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎలక్ట్రీషియన్ కోర్సులో 40, ఫిట్టర్‌లో 20, ఎలక్ట్రానిక్ మెకానిక్‌లో 24, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్‌లో 24, ఎయిర్ కండిషన్ టెక్నీషియన్‌లో 24, డ్రెస్ మేకింగ్ కోర్సులో 40 సీట్లు ఉన్నాయన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లను సమీపంలో ప్రభుత్వ ఐటీఐలో వచ్చేనెల 26వ తేదీలోపు వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు.

వృద్ధులు, దివ్యాంగులకు అన్నదానం



నెల్లూరు(బృందావనం): పడారుపల్లి దివ్యాంగుల కాలనీలోని ఆచార్య పీసీ రెడ్డి సమాజ మందిరంలో క్రాంతి మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం దివ్యాంగులు, వృద్ధులకు అన్నదానం చేశారు. పి.కార్తీకరెడ్డి, పి.రామ్‌కుమార్‌రెడ్డి, పి.శ్రౌషిక్‌రెడ్డిల సౌజన్యంతో ఈ కార్యక్రమం చేపట్టారు. నీలం పద్మమ్మ, పి.కవితారెడ్డి, పి.వరలక్ష్మమ్మ, జి.రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో పర్వతరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు నగర నియోజకవర్గంలోని 52వ డివిజన్‌లో టీడీపీకి చెందిన 25 కుటుంబాలు మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. నెల్లూరు రాంజీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో ఆ డివిజన్ ఇన్‌చార్జి మహబూబ్ ఆధ్వర్యంలో వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్సీ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి అండగా ఉంటూ సేవలందించిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు.

నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటా

- వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం
- ఒకటో డివిజన్ ఇన్‌చార్జ్‌గా సురేష్ యాదవ్



ఒకటో డివిజన్ నాయకులతో ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలకు అండగా ఉంటానని ఆ పార్టీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి భరోసా ఇచ్చారు. రూరల్లోని చింతారెడ్డిపాళెంలో ఉన్న తన నివాసంలో ఒకటో డివిజన్ నాయకులు, కార్యకర్తలతో మంగళవారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్ ఇన్‌చార్జిగా కోట సురేష్ యాదవ్‌ను నియమించామన్నారు. రూరల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి లేబూరు పరమేశ్వర్‌రెడ్డి, 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్ యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాస్ రావు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎంప్లాయిస్ • పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడు కనకట్ల మోహన్ రావు ముదిరాజ్, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి, ఒకటో డివిజన్ నాయకులు గంగి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

నెల్లూరు రూరల్: జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టేందుకు చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ కృషి చేస్తోందని సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జస్ట్ రైట్ ఫర్ చిల్డ్రన్ ఫౌండేషన్‌లో కలిసి జిల్లాలో బాల్య వివాహాలను ఆపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. జేఆర్సీ ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా 3 లక్షల బాల్య వివాహాలను నిరోధించినట్లు తెలిపారు.

పోలీస్ కస్టడీకి హత్య కేసు నిందితులు

నెల్లూరు సిటీ: ఇటీవల జరిగిన డ్రైవర్ హత్య కేసులో నిందితులను మంగళవారం పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. ఈనెల 9వ తేదీన డ్రైవర్ వాసుని అతడి స్నేహితులు పాతకక్షలతో హత్య చేసిన విషయం తెలిసిందే. దర్గామిట్ట పోలీసులు తొమ్మిది మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా తదుపరి విచారణ నిమిత్తం నిందితులను కస్టడీలోకి తీసుకున్నారు.

సీఎం పర్యటనను అడ్డుకుంటాం



మాట్లాడుతున్న మాబు

నెల్లూరు రూరల్: 'ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదు. సీఎం చంద్రబాబు ఆత్మకూరు పర్యటనను అడ్డుకుంటాం' అని ఆర్పీఐ జిల్లా అధ్యక్షుడు ఎస్కే మాబు తెలిపారు. మంగళవారం ఆయన నెల్లూరులో మాట్లాడుతూ హామీలు అమలు చేయకుండా పర్యటనల పేరుతో ప్రజల్లో తిరగడానికి ముఖం ఎలా చెల్లుతుందని ప్రశ్నించారు. కూటమి పెద్దలు సంక్షేమాన్ని గాలికొదిలి సహజ వనరులను దోచుకోవడంలో నిమగ్నమయ్యారన్నారు. జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. హామీలు నెరవేర్చకపోతే ముఖ్యమంత్రి పర్యటనలు అడ్డుకుంటామన్నారు.

వేగంగా రుణాల మంజూరు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో టిడ్కో గృహాలకు సంబంధించిన లబ్ధిదారులకు బ్యాంక్ రుణాల ప్రక్రియను సులభతరం చేయాలని కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. టిడ్కో గృహాల కేటాయింపుపై టిడ్కో, మెప్మా అధికారులు, బ్యాంకుల ప్రతినిధులతో మంగళవారం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సమీక్ష నిర్వహించారు. నందన్ మాట్లాడుతూ జూన్ నెల 12వ తేదీ నాటికి పెండింగ్‌లో ఉన్న లోన్లు క్లియర్ చేసి, లబ్ధిదారులకు గృహాలను అందజేయాలని ఆదేశించారు. లబ్ధిదారుల కుటుంబ సభ్యుల్లో సిబిల్ స్కోర్ బాగున్న వారిని కూడా జాయింట్ చేస్తూ రుణాలు మంజూరు చేయాలన్నారు. రుణాల మంజూరులో తలెత్తే వివిధ సందేహాలను నివృత్తి చేసి, లోన్ అందేందుకు మెప్మా విభాగం పూర్తిగా సహకరించాలని సూచించారు. సమావేశంలో టిడ్కో ఎస్‌ఈ మహేష్, డీఈఈ పార్థసారథి, డీసీఓ రామసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రఘురామకృష్ణరాజుపై చర్యలకు డిమాండ్



రాస్తారోకో నిర్వహిస్తున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. 53వ డివిజన్ వెంకటేశ్వరపురం సెంటర్‌లోని పార్టీ కార్యాలయం నుంచి పురవీధుల్లో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ పేదల ఇళ్ల తొలగింపుపై ప్రశ్నించిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. రఘురామను పార్టీ, స్పీకర్ పదవి నుంచి తొలగించాలన్నారు. కార్యక్రమంలో నేతలు కత్తి శ్రీనివాసులు, సూర్యనారాయణ, నాగేశ్వరరావు, మూలం ప్రసాద్, గడ్డం శ్రీనివాసులురెడ్డి, పద్మ, జాఫర్, శివకుమార్, వెంకటేశ్వర్లు, మంజులమ్మ పాల్గొన్నారు.

యోగాలో బంగారు పతకం



పతకం అందుకుంటున్న కావ్యశ్రీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా యోగాసన భారతి సంయుక్తంగా నిర్వహించిన రెండో ఆసియా ఇంటర్నేషనల్ యోగా స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో నెల్లూరుకు చెందిన యోగా క్రీడాకారిణి గుంజి కావ్యశ్రీ బంగారు పతకాన్ని సాధించింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఈ అంతర్జాతీయ పోటీల్లో 21 దేశాల క్రీడాకారులు పాల్గొన్నారు. నెల్లూరు వాసి ప్రథమ స్థానం సాధించడంపై పలువురు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు.

ప్రజాసత్తా మహిళా కమిటీ ఏర్పాటు



మాట్లాడుతున్న శోభన్‌బాబు

నెల్లూరు రూరల్: ప్రజాసత్తా నెల్లూరు పార్లమెంటరీ మహిళా కమిటీని ఏర్పాటు చేశామని జాతీయాధ్యక్షుడు పులగర శోభన్‌బాబు తెలిపారు. మంగళవారం నెల్లూరులోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ అధ్యక్షురాలిగా షేక్ షభానా, ఉపాధ్యక్షురాలిగా ఎస్.మెహతాబ్, కార్యదర్శిగా షేక్ గుల్తాన్ బేగం, సహాయ కార్యదర్శిగా షేక్ అర్షియా, కోశాధికారిగా షేక్ గౌసియా బేగం, కన్వీనర్‌గా షేక్ నౌషిన్ తదితరులను నియమించామన్నారు. ప్రజాసత్తా జిల్లా కో–ఆర్డినేటర్ బి.సంతోష్ పాల్గొన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

- కమిషనర్ నందన్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ వైఓ నందన్ వెటర్నరీ వైద్యులను ఆదేశించారు. 5వలోని డివిజన్ వైకుంఠపురం, సత్యనారాయణపురం, నేత నగర్, అహ్మద్ నగర్, అరవపాళెం, 6వ డివిజన్ స్టోన్‌హౌస్‌పేటలోని, చెన్నూరువారివీధి, సాలె వీధి తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలోని ఏబీసీ కేంద్రం ద్వారా వీధి కుక్కలకు వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని సూచించారు. శస్త్రచికిత్స సమయంలో తగిన మోతాదులో ఆహారం అందించి సంరక్షించాలన్నారు. బోడిగాడితోట, అహ్మద్ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ వీధి దీపాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న నూతన అపార్ట్‌మెంట్‌ను కమిషనర్ పరిశీలించి, బిల్డింగ్ ప్లాన్ అనుమతులను తనిఖీ చేశారు. తర్వాత స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలోని అన్న క్యాంటీన్‌ను చూశారు. కార్యక్రమాల్లో వెటర్నరీ వైద్యులు డాక్టర్ మదన్‌మోహన్, ఇంజినీరింగ్ విభాగం డీఈఈ ముజాహిద్దీన్, రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

- నగరపాలక సంస్థ పరిధిలో ప్లాస్టిక్ వ్యర్థాలు, అట్టలు, ఇతర నిరుపయోగ వస్తువులను సేకరించి, మార్కెట్లో విక్రయించే వారిని గుర్తించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ నందన్ తెలియజేశారు. మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్‌ను కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య ఇన్‌చార్జిగా, శానిటేషన్ సూపర్‌వైజర్ నరసింహారావు నోడల్ అధికారిగా, 30 మంది వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శుల బృందం, అలాగే నవజీవన ఆర్గనైజేషన్ ప్రతినిధి సహదేవయ్య వారి బృంద సభ్యులు 50 మంది కార్పొరేషన్ పరిధిలో చెత్త సేకరణ వృత్తిదారులను యాప్ ద్వారా గుర్తించి సర్వేలు నిర్వహిస్తున్నారని తెలిపారు. వ్యర్థాలను సేకరించే వారికి ఉచిత వాహనాలను అందించి వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య సేవలు అందించేలా ఆయుష్మాన్ కార్డులను అందజేస్తామన్నారు.

సీహెచ్‌ఓల నిరసన



నెల్లూరు(అర్బన్): సమస్యలు పరిష్కరించాలంటూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు సీహెచ్‌ఓలు మంగళవారం స్థానిక సంతపేటలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు భానుమహేష్ మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా తమకు 23 శాతం వేతన సవరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న తమకు ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు మినహాయింపు ఇవ్వాలని కోరారు. రెగ్యులర్ చేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్ మందిరాల అద్దెను చెల్లించాలని కోరారు. ఇన్సెంటివ్స్‌ను తక్షణమే విడుదల చేయాలని కోరారు. మెటీరియల్ రవాణా చార్జీలు చెల్లించాలన్నారు. లేకుంటే విధుల్ని బహిష్కరించి నిరవధిక సమ్మెకు వెళ్తామన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రిబాక, నాయకులు సుగుణ, అనూష, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎండ దెబ్బ తాళలేక..



ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. వేసవి తాపాన్ని జనం భరించలేకపోతున్నారు. ఇక మూగజీవాల పరిస్థితి చెప్పనక్కర్లేదు. నెల్లూరులో ఎండ వేడిమికి తాళలేక కోతి కవర్‌ను చింపి అందులోని పుచ్చకాయను తింటుండగా తీసిన చిత్రం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు